# ఆవకాయరోజులొచ్చాయి ...... ఆవిడేగతి!



కొండేపూడి సూర్య కామరాజు

ఒక పరమాణువును శతసహస్రకోటి ముక్కలుచేసి అందులో ఒక ముక్కను తీసుకుని వెంకయ్యతో పోల్చిచూస్తే ఆ రేణువు అతనికంటె అనేక కోట్ల రెట్లు పెద్దది. అటువంటిది అనంతకోటి గోళాలతో నిండిన విశ్వాంతరాళంతో పోలిస్తే అతని గతేమిటి ? అత్యధిక శక్తివంతమైన ఎలక్ట్రాన్ మైక్రోస్కోప్‌తో చూసినా వెంకయ్య దర్శనం దుర్లభం. అయితే అది విశ్వాంతరాళంతో పోలిస్తే సంగతి

ఒకానొక పట్టణంలో ఏడువందల ఎత్తురవు గజాల ఆవరణలో ఏడు గదుల ఆఫీసులో ఒక గదిలో గాడ్రెజ్ టేబుల్ వెనకవున్న తిరుగుడు కుర్చీలో సుష్టుపూర్తిగా కూర్చున్న వెంకయ్య భేతాళుడికన్న పెద్దవాడు! అక్కడ పని చేస్తున్న ఇరవైమందికీ అధికారి – ఆఫీస్ మేనేజర్. మరి నేనో ? - గుమాస్తా చిన్న 'పెద్దగుమాస్తా'

"సార్, పిలుస్తున్నారు సార్ !"

"ఎవరు ?"

"అయ్యగారు సార్ !"

"ఏ అయ్యగారు ?"

"మేనేజరుగారు సార్ !"

కలం బల్లమీద పెట్టి ఫైలు మూసేసి వెళ్లాను. వెళ్లి సవినయంగా నిలబడ్డాను. ఎంతలేదన్నా మేనేజరేమో మహాబిజీగా వున్నాడు. తలెత్తి చూడలేదు. దీక్షగా వార్తాపత్రిక చదువుతున్నాడు. పది నిముషాలపాటు పాదాలకు శ్రమయిచ్చిన తర్వాత మెల్లగా అన్నాను.

"సార్ !"

మేనేజర్‌సాబ్ మెల్లగా తలెత్తి అమాంతం ఆ ఆరడుగుల్నీ, మూటఅరవై పౌన్లనీ ఇగ్నోర్‌చేసి మళ్లీ పత్రికలో మునిగిపోయాడు. నాకప్పుడు 'ఆర్యభట్టు' మీద కూర్చుని ఆయన్ని చూద్దామనిపించింది.

"ఫిగర్సన్నీ వెరిఫై చేశారా ?" తలెత్తకుండానే అడిగాడు.

"ఆఁ... చేశానండి...అబ్బె చేసేస్తానండి." ఒక్కసారి ఉపగ్రహంమీంచి ఊడిపడి మా ఆఫీస్ మేనేజర్ వెంకయ్యగారి ముందు మైక్రోస్కోపిక్‌గా నిలబడి తబ్బిబ్బై సమాధానం చెప్పాను.

"ఇదుగో చూడండి–మీరేం చేస్తుంటారు?"

"ఎక్కడండీ ?"

"ఎక్కడో ఏదో చేసుకుంటే నాకెందుకూ? ఆఫీసులో సంగతి."

"పని"

"ఏం పని ?"

"ఆఫీసు పని"

"ఏ ఆఫీసు ?"

"ఏ ఆఫీసేమిటండీ ? - మన ఆఫీసే"

"ఆఁ – ఆగండి. మన ఆఫీసు పని మీరు చేస్తుంటే వెరిఫికేషన్ బిజినెస్ మూడు రోజుల క్రితం అయిపోయివుండవలసింది. ఇన్ఫరెన్స్ ? మీరు పని చెయ్యటంలేదన్నమాట."

"అయితే పని చెయ్యక నిద్రపోతున్నానంటారా ?" వళ్లు మండి ధైర్యంచేసి అడిగేశాను.

"ఆఁ – సరిగా అదే అంటాను."

వెంకయ్యగారు మేనేజర్ కావచ్చు. గోల్డ్‌ఫ్లేక్ సిగరెట్లు తగలెయ్యవచ్చు. ఆఫీసులో హాయిగా వార్తాపత్రికలు చదువుకుంటూ కూర్చోవచ్చు. కాని... ఉదయంనించి సాయంత్రందాకా యంత్రంలా పనిచేస్తుంటే నిలువునా నిర్మొగమాటంగా నిద్రపోతున్నానవడం ఈయనకేకాదు, ఏ మేనేజరుకయినా తగనిపని. ఒక్కసారి గగనవీధుల్లో విహరిస్తూ పరమాణువు చూర్ణంలో ఒక రేణువుకంటే కూడా అల్పుడైన వెంకయ్యను చూడాలని మహా ఉబలాటపడ్డాను.

"సరే. ఆ వెరిఫికేషన్ అట్లా వుంచండి హెడ్డాఫీస్‌కి మనం మన్త్లీ రిపోర్టు పంపాలి. రేపు సాయంత్రానికి రిపోర్టు తయారుచేసి నాకు స్వయంగా అందచెయ్యండి. కావలసిన. డేటా అంతా ఈ ఫైల్లో వుంది. మోహనరావుగారు శెలవు పెట్టిన సంగతి మీకు తెలుసుగా" అంటూ సాభిప్రాయంగా నావేపు చూశాడు వెంకయ్యసాబ్.

దేనికైనా హద్దూపద్దూ వుండాలి. నా పనితోనే నాకు ఊపిరి సలపకుండావుంటే పైగా శలవుపెట్టినవారి పనులుకూడా నా నెత్తిన రుద్దడం ఏం న్యాయం? శాస్త్రిగారు శలవు పెట్టిన ఫలితంగా నామీద పడినదే యీ వెరిఫికేషన్ వర్క్ కూడా. అది చాలక మోహనరావుగారి పని కూడాను – ఇంతా చేస్తే నాకు ప్రతిఫలం ఏమిటి ?

ఒక్క చీదరింపు. కాకపోతే రెండు చివాట్లు! మనోభావాలను మనసులోనే అణిచిపెట్టి మారు మాట్లాడకుండా ఫైల్‌తోసహా స్వస్థానం చేరుకుని మంటి కుర్చీలో కూలబడ్డాను.

## 2

"ఎన్నిసార్లు పిల్చినా పలకరేం? ఈపూట భోజనం చెయ్యదల్చుకోలేదా?"

"........"

"ఇదుగో ... మిమ్మల్నే ... మాట్లాడరా?"

"........"

"మాట్లాడరన్నమాట. ఉండండి చెప్తా..."

"ఇదుగో నీకు బుద్ధుందా లేదా? — చక్కలిగింతలు పెడతావేం? పని చేస్తున్నా ననుకున్నావా, పాన్పుమీద పవ్వళించాననుకున్నావా?"

"అబ్బ ఎంత కోపమండీ. పనుంటేచాలు మీకు. పాన్పూ అక్కర్లేదు, భోజనం అక్కర్లేదు"

"ఇదుగో మాణిక్యం, నువ్వెళ్లి భోంచెయ్యి నేనీ పూట భోంచెయ్యను. రిపోర్టు తయారవందే నిద్ర కూడా పోను. చాలా ఇంపార్టెంట్."

"మీకిష్టమని బంగాళాదుంపలు వేయించి, పప్పపులుసు పెట్టాను. భోజనంచేసి వెళ్లండి. పని ఎక్కడికీ పారిపోదు ఇక్కడే వుంటుంది"

"నీకెంతైనా పుణ్యముంటుంది. నువ్వెళ్లి భోంచెయ్, నన్ను బాధపెట్టకు."

"ఊహుం. మీరు భోజనం చెయ్యకపోతే నేనూ చెయ్యను."

"........"

"అబ్బ రండీ సరదాగా మనిద్దరం భోంచేద్దాం."

"అసలే ఫైళ్లతో కుస్తీపడుతూ సతమత మవుతుంటే సరసం కూడాను. మాణిక్యం పట్టుపట్టిందంటే విడవడమంటూ వుండదు. ఛల్లాకంపట్టు. భోజనంచెయ్యక తప్పలేదు. అయితే, బంగాళాదుంపల ముక్కలు బాగానే వున్నాయనుకోండి!"

"చూడండీ — మీకు నిద్ర లేకపోతే ఆరోగ్యం చెడుతుంది. హాయిగా పడుకోండి. పని సంగతి రేపు చూసుకోవచ్చు."

"నన్నట్టే బాధపెట్టక నువ్వెళ్లి పడుకో."

"నిద్రపొమ్మంటే బాధపెట్టానా? — బలేవారండీ మీరు."

"ఈ ఫైలు పూర్తవగానే పడుకుంటాను. నువ్వెళ్లి పడుకో."

"అదేం కుదరదు. మీరు ముందు నిద్ర పోవలసిందే."

"ఈ ఫైళ్ల బ్రహ్మరాక్షసుల్లాగా ఇక్కడ వుంటే నిద్ర ఎట్లా పడుతుంది?—నువ్వే చెప్పు"

"మరేం ఫరవాలేదు, నే పట్టిస్తా రండి..."

## 3

మర్నాడు మధ్యాహ్నం పన్నెండు గంటల ఎదకొండు నిముషాలకు మేనేజర్ గదిలో చిన్న తుఫాను వెలరేగింది. మేనేజర్ ముఖం కారుమబ్బు. కళ్ళు మెరుపులు, మాటలు ఉరుములు తుఫాను ఉధృతం తగ్గాక మెల్లిగా ఎక్స్‌ప్లెయిన్ చెయ్యడం మొదలుపెట్టాను.

"క్షమించండి సార్. ఫైల్స్ పూర్తవుతే కాని నిద్ర పోకూడదనుకున్నాను నిన్న రాత్రి, కాని మా ఆవిడ పట్టించేసింది సార్."

"వాట్ ది డెవిల్ డు యు మీన్? బిజినెస్ బిఫోర్ ప్లెజర్. దట్ మస్ట్ బి ది మోటో. ఆ మాత్రం తెలియకపోతే మీరు జీవితంలో పైకి రాలేరు."

"అదికాదు సార్..."

"ఏదికాదు?"

"అదే సార్... వాట్టై మీనిట్ రాత్రి తల నెప్పొచ్చింది సార్. మా ఆవిడ అమృతాంజనం పట్టించేసింది కణతలకి."

"అప్పుడు మీకు పట్టేసిందికదూ నిద్ర? - ఫైన్, వెరీ ఫైన్!"

"ఎగ్జాట్లీ సార్."

"షటప్ అండ్ గెట్ ది హెల్ ఔటాఫ్ హియ."

మెల్లిగా ఐ గాట్ ది హెల్ ఔటాఫ్ దే అండ్ టుక్ మై రికెటీ ఛైర్ — కూర్చున్నానన్న మాటేకాని నా మనస్సు ఊహాలోకంలోకి వెళ్ళిపోయింది — అనంతకోటి గోళాలతో నిండిన విశ్వాంతరాళం. అందులో భూగోళం, అందులో ఒక ఖండం. ఆ ఖండంలో భారతదేశం. అందులో ఒక రాష్ట్రం, ఆ రాష్ట్రంలో ఒక నగరం. అక్కడ ఏదో మారుమూల ఆఫీసులో, ఓ మారు మూల గదిలో తిరుగుడు కుర్చీలో కూర్చున్న వెంకయ్యని వైరస్‌కన్న చిన్నవాడ్నిగా చూసి మనసారా ఆనందించాను. అంతకంటె యింకేం చెయ్యను? — చెయ్యగలను?!

"సార్, పిలుస్తున్నారు సార్!"

"ఎవరు?"

"అయ్యగారు సార్!"

"ఏ అయ్యగారు?"

"ఇంకే అయ్యగారు సార్? — మన మేనేజరుగారు సార్!"

"ఓ — దట్ స్మాలర్ దెన్ ది వైరస్ యు మీన్?"

"అంటే ఏమిటి సార్?"

"ఏం లేదులే. వస్తున్నా పద."

పిల్లిని 'హూష్' అంటే పారిపోతుంది. అదే పిల్లిని గదిలో పెట్టి తలుపులన్నీ మూసి కొట్టబోతే గుడ్లు పీకుతుంది. పిల్లికి వున్న సెల్ఫ్ డిఫెన్స్ మనిషినైన నాకు మాత్రం ఎందుకుండకూడదూ? అయినా నేనేం తప్పు చేశానని? నా పని బాధ్యతతో, సమర్థవంతంగా చేస్తూనేవున్నాను. శలవుపెట్టిన వాళ్ళ పనంతా నన్ను చెయ్యమంటే ఎట్లా చెయ్యను? ఎట్లా చెయ్యగలను? అయినా నేనెందుకు చెయ్యాలి?

చొక్కా చేతులు పైకి మడిచి ధైర్యం కూడగట్టుకుని కుడి కాలు ముందర పెట్టి గదిలో ప్రవేశించాను. అక్కడి వాతావరణం పూర్తిగా మారిపోయి వుంది. ఇందాకటి గాలివాన వెలిసి ప్రశాంత వాతావరణం నెలకొనివుంది. మేనేజర్ ముఖం కూడా ప్రశాంతంగా వుంది. పైగ వార్తాపత్రిక చదవడంలేదు!

"నిలబడ్డారేం? — కూర్చోండి."

నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఎంతసేపైనా నిలబెట్టి మాట్లాడటమేకాని కూర్చోమని ఎప్పుడూ అనలేదు. ఏమిటో యీ ఆకస్మికాభిమానానికి కారణం? సరిగ్గా ఆయనకు ఎదురుగావున్న కుర్చీలో కూర్చున్నాను తంచన్‌గా.

"ఫైల్స్ గూర్చి మీరేం విచారించకండి అవి ఆనందరావుకి అంటగడతాను— మీరు మాత్రం నాకో చిన్న సాయం చెయ్యాలి."

నేనా? మేనేజర్‌గార్కి సాయం చెయ్యడమా! అంటే ఆయనకు సాయం చెయ్యగల్గిన సమర్థుడి న్నమాట చాలా సెల్ఫ్ ఇంపార్టెన్స్ ఫీలయ్యాను. ఆ క్షణంలో ఆయన్ని అంతరిక్షంలోంచి చూడాలని అనిపించలేదు.

"చెప్పండి. నేను చెయ్యగల్గినదైతే తప్పక చేస్తాను" సస్పెన్స్ భరించలేక అడిగేశాను.

"మీరు చెయ్యగలిగిందే, అంటే మీ ఆవిడ చెయ్యగలిగింది — టు బి ప్రిసైజ్."

ఏమిటబ్బా మా ఆవిడ ఈయనకు చెయ్య వలసిన సాయం? కొంపతీసి సినిమాకి కంపెనీ కిప్ చెయ్యమనడుకద.

"దయచేసి మా ఆవిడ మీకు చెయ్యవలసిన సాయం ఏమిటో తెలవిస్తారా?" ఉండబట్టలేక అడిగేశా.

"అబ్బ. వెధవ తలనెప్పి. గంటనించి ప్రాణం తీసేస్తోంది."

కొంపతీసి కణతలకి అమృతాంజనం పట్టించ మంటాడేమో నా అర్థాంగిని. అంతే. అదే అయుంటుంది. పైకుబికివస్తున్న కోపాన్ని అణచిపెట్టి సాధ్యమైనంత మృదువుగా అన్నా —

"ఇంతకీ మీరనేది మా ఆవిడ వచ్చి మీ కణతలకి..."

"నో నో నో నో నో, డోంట్ బీ సిల్లీ" అంటూ టేబుల్‌మీదున్న కాలింగ్ బెల్‌ని ఓ మొట్టికాయ మొట్టాడు.

"సార్" అనుకుంటూ ప్యూన్ ప్రత్యక్ష మయ్యాడు.

"రెండు స్ట్రాంగ్ కాఫీ"

నా ఆశ్చర్యానికి అంతులేదు. మేనేజర్‌గార్కి నామీద ఇంత ప్రేమ ఎందుకు పుట్టుకొచ్చిందో. ఒకవేళ నాచేతే రాయించుకుంటాడేమో అమృతాంజనం.

"ఇదుగో యిది ఏ సీజనూ?" నా ఆలోచన లకు అంతరాయం కల్గిస్తూ అన్నాడు మేనేజర్ వెంకయ్య.

"సమ్మర్ సర్"

"సమ్మర్లో మనం ఏంచేస్తాం?"

"మీరు ఏ. సి. గదిలో కూర్చుని ఫైళ్ళ మీద సంతకాలు పెడతారు నేను సీలింగ్ ఫాన్ పదిమందితో పంచుకుని పని చేస్తూంటాను."

"డేమ్ ది ఆఫీస్. ఆఫీస్ సంగతి కాదండీ నేను చెప్పేది. ఇంటి సంగతి."

"మీరు కూల్‌డ్రింక్స్ తాగుతూ కుక్కతో

[ 35వ పేజీ చూడండి ]

ఆడుకుంటారు నేను కొత్తకుండలో మంచినీళ్ళు తాగుతూ బరబరలాడే ఫాన్ కింద బాధపడు తుంటాను ''

''అబ్బ, అదికాదండీ ఇప్పుడేకదా మన ఆంధ్రులు ఆవకాయ పెట్టుకొనేది ''

ఈ మాత్రందానికి ఇంత ఉపోద్ఘాత మెందుకూ ? — డైరెక్టుగా చెప్తే పోలా ?

''అవును సార్ ! ఆవకాయలు సమ్మర్‌లోనే పెట్టుకుంటారు ''

'ఏగ్జాట్లీ — అన్నట్టు మీరు ఆవకాయ పెట్టుకోటం పూర్తయిందా ?''

''మా ఆవిడ పోరు పడలేక ఆవకాయకు కావలసిన సరుకులు కొనడానికి బజారు కెళ్ళాను సార్ ! ఎండుమిర్చి ఖరీదు విని వళ్ళు మండి ఇంటి కొచ్చేశా సార్— కొనకుండా.''

''ఆఁ ఖరీదుదేముందీ ? మన ఆంధ్రులలో ఆవకాయ పెట్టుకోనివాళ్ళు చాలా అరుదు ''

ఇంతలో ప్యూన్ కాఫీలు టేబిల్ మీద పెట్టాడు ఆయన ఒక కప్పు అందుకుని తాగుతూ రెండో కప్పు వైపు చూస్తూ అన్నాడు—

''తీసుకోండి చల్లారిపోతుంది ''

వేడి వేడి కాఫీ మెల్లిగా సిప్‌చెయ్యడం మొదలుపెట్టాను 'ఉష్ణం ఉష్ణేన శీతలః' అన్నారుకదా పెద్దలు

''మా శ్రీమతి సంగతి మీకు తెలుసుగా ఇంటి పన్లు ఏం చేతకావు. పైగా నాజూకు మనిషి రేపు మీ ఆవిడ్ని మా శ్రీమతి వద్దకు పంపించండి. కాస్త ఆవకాయ తయారుచెయ్యడానికి సాయపడతారు '' చావు కబురు చల్లగా చెప్పాడు

ఆరి వీడి తస్సాదియ్యా, నా భార్య 'ఆవిడా'నూ, ఆయన భార్య 'శ్రీమతీ'నా! వాళ్ల శ్రీమతి నాజూకు మనిషట — నాజూకూ! మా ఆవిడే కాబోలు మోటుమనిషి. పైగా ఆవకాయ పెట్టాలిట వాళ్ళావిడకు ఆవకాయ కలిపితే చేతులు మండుతాయిట అవును పాపం నాజూకు మనిషి కాదూ మరి ! ఆవిడ చేతులు మండడం అటుంచి నా వళ్ళు మండింది

''మా ఆవిడ కూడా నాజూకు మనిషేనండి కారాలూ అవీ ప్రతి సంవత్సరం పనిమనిషిచేత దంపించడం, నా చేత కలిపించడంతప్ప తనెప్పుడూ ఆవకాయ కలపదండి నేను కలుపుతూంటే నూనె మాత్రం పోస్తుందండి '' వ్యంగ్యానికి వినయం జోడించి అన్నాను

''అయితే ఇకనేం ? ది ప్రాబ్లెమ్ ఇజ్ సాల్వ్‌డ్ థేంక్‌గాడ్ ''

కొంప ముంచేశాడు! అంటే నేను వాళ్ళింటి కెళ్ళి ఆవకాయ కలపాలన్నమాట 'ఇంపాజిబుల్ కుదరదు' అని చెప్పేద్దామనుకున్నాను. కాని కాఫీ తాగి ఆబ్లిగేషన్‌లో పడిపోయాను ఏం చెబుదామా అని ఆలోచిస్తుంటే అంతరాయం కలిగిస్తూ అన్నాడాయన —

''కారాలూ అవీ సిద్ధంగా వున్నాయి మీరు చెయ్యవలసిందల్లా కారం, ఉప్పూ, ఆవపొడుం, మామిడికాయ ముక్కలు బాగా కలిసేటట్టు కలపడమే నూనె తాయారే పోస్తుందిలెండి యు కెన్ టేక్ టుమారో ఆఫ్ ''

## ఆవకాయరోజులొచ్చాయ్.... ఆవిడే గతి

[ 25వ పేజీ తరువాయి ]

''రేపు సెలవు పెడితే వర్క్ సఫరవు తుందండి.'' ఆవకాయ అవస్థ తప్పించుకోడానికి ప్రయత్నించాను

''మరేం ఫరవాలేదు. రేపు మీ పని కూడా ఆనందరావుకి అంటగట్టేస్తా.''

నేనేం మాట్లాడలేదు. ఏం మాట్లాడనూ? అనవసరంగా కాఫీ తాగి ఆబ్లిగేషన్‌లో పడ్డాను అయినా ఆనందరావు జాతకం కూడా అంతంత మాత్రంగానే ఏడిసింది !

**4**

సాయంత్రం ఇంటి కెళ్లకుండా తిన్నగా బజారు కెళ్లాను. మల్లెమొగ్గలూ, కనకాంబరాలూ కలిపి కట్టిన మాల మూడు గజాలు కొన్నాను బోంబే స్వీట్ స్టాల్లో రెండు బాదుషాలూ, మూడు మైసూర్‌పాకులూ, నాలుగు తొక్కుడు మిఠాయిలూ పార్సెల్ చేయించాను నాకు తెలిసిన ఒక బట్టలషాపులో నల్లటి నైలెక్స్ చీర అరువు తీసుకున్నాను. ఈ సరంజామా అంతా రిక్షాలో వేసుకుని ఇంటికి బయలుదేరాను. రిక్షాలో వెడుతుంటే ప్రక్కనున్న పరిసరాలు నాకేం కనపడటంలేదు ఒకే ఆలోచన — ఒకే దృష్టి — ఒకే లక్ష్యం — ఒకే సమస్య. మేనేజరుగారింట్లో ఆవకాయ సమస్య ! నేనాయన ఇంటికెళ్లి ఆవకాయ కలపడం హాస్యాస్పదంగా తోచింది అప్పటికీ మనస్సుకు నచ్చచెప్పుకోడానికి ప్రయత్నించాను తన ఆత్మగౌరవం దెబ్బతింటుందనీ, అది భరించలేననీ నా అంతరాత్మ నాతో ఖచ్చితంగా చెప్పేసింది ఈ పరిస్థితుల్లో మా ఆవిడొకతే నాకు శరణ్యం ఆవిడను మంచిచేసుకోవాలి బ్రతిమాలుకోవాలి, ప్రాధేయపడాలి. నా బజారు పనికి అంతరార్థం అదే

మూతి మీద చిరునవ్వు ధరించి ఇంట్లో అడుగు పెట్టాను హాల్లోనూ, ప్రక్క గదులలోనూ ఆవిడ జాడ ఎక్కడా లేదు 'మాణిక్యం' అని మృదువుగా ప్రేమ ఉట్టిపడేటట్టు పిల్చాను ఒక చేత్తో వెదురు విసినకర్రా, ఇంకో చేత్తో అట్లకాడా పట్టుకుని ముక్కుమీద మసితో సిద్ధమైంది నాకు పరిస్థితి అర్థమైపోయింది ముక్కుకి మసిరాసుకొచ్చిన ముదితను చూస్తూ ఒక్కక్షణం నిశ్చేష్టుడనై నిలబడిపోయాను

''ఏం ? అల్లా చూస్తారేం ? — అయినా ఇంత ఆలస్యమైందేం రావడం ?''

నా బుర్ర పనిచెయ్యడం ప్రారంభించింది ఒక్కసారి ఫ్రాయిడ్, జంగ్, ఎల్లిస్ మొదలైన మేధావుల్ని తల్చుకున్నాను వెంటనే మెదడులో మెరుపు మెరిసింది. ఫ్లేటర్, ఫ్లేటర్ - ఫ్లేటర్ హెర్ విమెన్ లైక్ ఫ్లేటరీ!

''నువ్వెంత అందంగా వున్నావు మాణిక్యం ! నీ దివ్యసుందర ముఖారవిందం చూసి పరవశంతో చూస్తూ ఉండిపోయాను ఇంత ఆలస్యంగా రావడమంటావా విను చెప్తా చెప్పనా నిజం చెప్ప నాకేమన్నా బుద్ధుందంటావా ? అసలు ఉందంటావా అని ''

''ఉందని ఎల్లా అంటాను ? మీకేనాడో చెప్పాను, బుద్ధిలేదని.''

కొంప మునిగింది. నా ప్రయత్నానికి వాతావరణం అనుకూలంగా లేదు మొదట్లోనే పప్పులో కాలేశాను ఇది చాలా క్రూషల్ మూమెంట్. జాగ్రత్తగా ఆలోచించి తూచి మాట్లాడాలి. ఈ ధోరణిలో ఇంకొక్క మాట శ్రీమతి నోటినుంచి వచ్చిందో తాయారమ్మగారి ఆవకాయ నేనే తయారుచెయ్యాలి అందుకని ఉన్న ప్రేమకు మరింత కలిపి ఆ మిశ్రమాన్ని ఒలక పోస్తూ అన్నాను —

''నల్ల నైలెక్స్ చీర కొనిపెట్టమని ఆర్నెల్ల నించి అడుగుతున్నావు బుద్ధున్న మొగుడైతే అన్నిసార్లు అడిగించుకుంటాడా ? ఏ అప్పోసొప్పో చేసి వెంటనే కొనిపారెయ్యడూ ?''


''ఈ వాశేమిటి, కొత్తగా మాట్లాడు తున్నారూ ? స్నేహితుల నెవరినైనా భోజనానికి పిల్చారా ? ఒకవేళ పిల్చుంటే అదేం కుదర్దు. అసలే తడిబొగ్గులతో తన్నుకొంటున్నాను '' అని వెనుతిరిగి వెళ్లిపోయింది

అసలే ముక్కుకి మసి రాసుకొచ్చింది అటువంటప్పుడు ఆమెను సమాధానపర్చడం అసంభవం. షెర్లాక్ హోమ్స్ సీరీస్ చదివి వుండడంవల్ల ఆమె ముక్కుమీద మసి ఎట్లా వచ్చి వుంటుందో చెప్తా వినండి 'గాస్' అయిపోయింది అందుకని బొగ్గుల కుంపటి అంటించింది ఖర్మం చాలక తడిబొగ్గులవడంవల్ల ఎంత కిర్సనాయిలు పోసినా కుంపటి రాజుకుని వుండదు విసనకర్రతో ఎంత విసిరినా పొగ తప్ప ఫలితం కనిపించివుండదు. తత్ఫలితంగా కళ్ళ మండి ముక్కమ్మట నీరు కారివుంటుంది అప్పుడామె బొగ్గులు పోసిన మసిచేత్తో ముక్కు చీదుకునివుంటుంది చూశారా నాదెంత సూక్ష్మ బుద్ధో. అయినా మా ఆవిడ నాకు బుద్ధిలేదని ఏనాడో చెప్పిందిట ! టు హెల్ విత్ ది బ్లడీ లైఫ్

త్వరగా ఆఫీసు బట్టలు విడిచేసి లుంగీ కట్టుకుని వంటింట్లోకెళ్లాను వెళ్లక ఏం చెయ్యనూ ? విరమించడానికి వీలులేనిది నా ప్రయత్నం

''చూడు మాణిక్యం, నువ్వు కోమలాంగివి బొగ్గుల కుంపటితో బాధపడలేవు వంట నేను చేస్తా కాని నువ్వెళ్లి శుభ్రంగా స్నానం చేసిరా'' అన్నాను, స్నానం చేస్తే చల్లబడుతుందనే ఆశతో

భార్యారత్నం నావైపు అదోలా చూసి అక్కడ నించి మెల్లగా జారుకుంది శుభ శకునం, 'హమ్మయ్య' అని ఒక్కసారి నిట్టూర్చి కుంపటితో కుస్తీపట్టడం మొదలుపెట్టాను వంట ముగిశాక మా అమ్మ కోడలికి కొత్త చీర కట్టబెట్టాను పూలచెండు తల్లో తురిమాను దగ్గిరుండి భోజనం చేయించాను ఆ తతంగం ముగిశాక మాణిక్యాన్ని తిన్నగా తీసుకెళ్లి నిలువుటద్దంముందు నిలబెట్టి అడిగాను



అమరశిల్పి జక్కన్న మహ్నవిగా పేర్కొంచిన బేలూరు (కర్నాటక)లోని దేవాలయ శిల్ప సౌందర్యం. —ఫొటో : వి.యస్.వి. ప్రసాద్

"నువ్వు నిజంగా నా భార్యవేనా లేక దివినుండి దిగివచ్చిన దేవతవా ?"

"పొగడ్తలకేంకాని మీకేంకావాలో చెబుదురూ చెప్పక."

"నువ్వు దేవతవి -- నువ్వే కావాలి."

"అవును. నేను దేవతనే -- భ(ర్తా)క్తా ఏమి నీ కోరిక ?"

'మహాప్రసాదము నీవు మా బాస్ గృహంబునకుం జని తద్గృహిణికి 'ఆవకాయ' అనంబడు కార్యంబునకు గర్తృత్వము వహించి నన్ను ధన్యునిగావింపుము దేవీ !"

"ఏమిటీ ? మీ బాస్ పెళ్ళానికి నేను ఆవకాయ పెట్టాలా ?"

"పెట్టుటయన సంపూర్ణముగా పెట్టనవసరంబులేదు. కారంబుల్ మొదలైనవి మర్దించబడి చూర్ణము గావించబడియుండును. రసాలములు తరుగబడియుండును. దేవి తన కుసుమకోమల హస్తముంచే వాటిని గలిపిన జాలును." వెధవది ఎవరన్నా కాస్త గ్రాంధికం అందిస్తే చాలు నా కదేపనిగా గ్రాంధికమే వచ్చేస్తుంది. ఏం చెయ్యను ?

"అయితేమాత్రం, నా చేతులు మండవా యేం ?"

"సందేహించకుము దేవీ ! తైలంబున్ వాయూరే బోయును."

"ఓరీ బుద్ధిహీనుడా ! తైలముం బోసినంత మాత్రాన హస్తములు మండునురా ? కారము తగిలిన మండునుకాని "

చూశారా, చూశారా కొత్త చీర కట్టుకుని గ్రాంధికంలో ఎట్లా తిడుతోందో ! తప్పదు భరించా బరించాను బుజ్జగించాను. బ్రతిమలాడాను, ప్రాధేయపడ్డాను -- ప్రార్థించాను. చివరిగా ఒంటిగింటకు ఒక్కసారి ఆవలించి--

"సరేలెండి" అనేసి అటు తిరిగి పడుకుంది.

నా ఆనందాన్ని నేను వర్ణించలేను. చేతనైతే మీరు వూహించుకోండి

# ఆవకాయరోజులొచ్చాయ్... ఆవిడే గతి

## 5

"సార్, పిలుస్తున్నారు సార్ !"

"ఎవరు ? .. ఆఁ బాస్ కదూ, వస్తున్నా నద "

గదిలో అడుగు పెట్టానోలేదో --

"వాట్ ది డెవిల్ డజ్ దిస్ మీన్ ? ఐ" అస్కడ్ యు టు టేక్ టు డే ఆఫ్ -- డిడిన్ట్ ఐ ?

"యు డిడ్ సర్"

"దెన్ వై షడ్ యు అప్పియర్ హియర్ ఇన్ ఆల్ ఫ్లెష్ అండ్ బ్లడ్ ? -- గెట్ ది హెల్ .."

"... ... అదికాదు సార్..."

"ఏది కాదూ ? గెట్ ది హెల్ ఔట్ ఆఫ్ హియర్ అండ్ అటెండ్ టు మై ఆవకాయ -- ఐ మీన్ పికిల్స్"

"అదికాదు సా.."

"నథింగ్ డూయింగ్, యు గె..."

"అట్లాగే వెడతాను. ఒక్క మాట వినండి సార్"

"ఔట్ విత్ ఇట్."

"మా శ్రీమతి మీ ఆవిడగారి దగ్గరకు వెడతారు సార్."

"అదా సంగతి. వన్ మోర్ ప్రాబ్లెమ్ సాల్వ్. థేంక్యూ థేంక్యూ ఐ మీన్ థేంక్ యువర్ లైఫ్ -- డిడ్ యు రిఫర్ టు మై వైఫ్ ఏజ్ 'ఆవిడ' ?"

"డిడ్నై సర్ ?"

"ఓ గాడ్, దటీజ్ వాటయామ్ ఆస్కింగ్యూ"

"ఇఫై డిడ్ అయామ్ సారీ సర్ వాట్ఐ మీన్ట్... మీ శ్రీమతి మా ఆవిడ సర్ "

"వ్హాట్ !"

"అదే సర్. మీ శ్రీమతి మా ఆవిడ. అంటే మీ భార్య శ్రీమతి. నా భార్య ఆవిడ."

"దట్సైట్. దటీజ్ ది వే యు షుడ్ రిఫర్ టు అవర్ వైవ్స్."

వీడి ఇంగ్లీషు తగలడా ! ఉచ్చారణ మా సీమదొరలని అనుకరిస్తాడు. 'అవర్ వైవ్స్' అనకపోతే 'అవర్ రెస్పెక్టివ్ వైవ్స్' అని ఏడవకూడదూ ?

## 6

మర్నాడు సాయంత్రం ఆఫీసునుంచి ఇంటికి వెళ్ళేటప్పటికి ఇల్లు తాళంవేసి వుంది. అంటే ఇంకా ఆవిడ తాయారమ్మగారితో తంటాలు పడుతోందన్నమాట. తాళంచెవి పక్కవాటా పంతులమ్మ కిచ్చిందేమోనని వెళ్లి అడిగితే లేదంది పంతులమ్మ. ఇంతలో గుమ్మం ముందు మా బాస్ కారాగింది. మాణిక్యంతో బాటు రెండు జాడీలు కూడా కారొల్లొంచి దిగడం చూసి ఆశ్చర్యపోయాను

"ఏమిటి సంగతి ? -- అటునించి వస్తున్నారు ?"

"అబ్బే తాళంచెవి అక్కడిచ్చావేమోనని అడిగొచ్చా అంతే."

"ఆ అవకాశం మీకు కలిగిస్తానని యెల్లా అనుకున్నారూ ? -- ఎప్పుడైనా ఏ పరిస్థితుల్లోనైనా ఎవరికైనా తాళంచెవి ఇచ్చి వెళ్లవలసివస్తే ఎదురింటి బామ్మగారిక్కి యిచ్చి వెడతా. బాగా జ్ఞాపకం వుంచుకోండి."

ఈ ఆడవాళ్ళంతా ఇంతే. ఉత్త అనుమానం మనుషులు. అయినా అపర శ్రీరామచంద్రుడినైన నన్ను గూర్చి ఆవిడ అవిధంగా అనుమానపడటం నాకేమీ నచ్చలేదు. మరొకప్పుడైతే మంచి 'రిటార్ట్' యిచ్చివుందును. అప్పుడుమాత్రం ఆవకాయ జాడీల ముఖాలు చూసి మా ఇంటావిడను క్షమించేశాను.

అరాత్రి తక్కిన ఆధరువులు ముట్టుకోకుండా ఆవకాయతోటే అన్నంతినడం సాగించాను. ఆవకాయ బ్రహ్మాండంగా వుంది. అయినా రెండు గంటల పనికి రెండు జాడీల ఆవకాయ కమీషన్ కొట్టడం నాకేం నచ్చలేదు.

"ఏదో శాంపుల్‌కి కాస్త ఆవకాయ తీసుకుంటే పరవాలేదు కాని మరీ రెండు

జాడిలా! నాకెం నచ్చలా — ముక్క ఊరలేదు కాని కాస్త పెండి వడ్డించు"

"అవును, మీకెందుకు నచ్చుతుంది? తినడ మైతే రెట్టింపన్నం తింటారు ఆవకాయతో — అయినా నేనేం అడిగానా ఏమన్నానా? వద్దు వద్దు అంటుంటే వినకుండా కార్లో పెట్టించేసింది. ఒక జాడీ మామూలు ఆవకాయ — రెండోది ఉల్లావకాయ."

"అవును పాపం. నువ్వు మాత్రం ఏంచేస్తావ్ ఆవిడ బలవంతపెడితే — ఏదీ కాస్త అన్నం పెట్టి ఉల్లావకాయ కూడా కాస్త రుచి చూపించు చూద్దాం."

ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ కాస్తకు మరికాస్త వడ్డించింది ఘుమఘుమలాడే ఉల్లావకాయ.

స్త్రీ జాతికి ఒక ప్రత్యేకత వుంది. వాళ్ళందరికీ స్వతహాగా కొంత మనస్తత్వ శాస్త్రం తెలిసి వుంటుంది. అనుకూలమైన సమయం కనిపెట్టి బైట పెడతారు వాళ్ళ కోర్కెల్ని.

"ఆవకాయ ఖర్చు నాలుగు వందలు మిగిల్చాను మీకు. ఆ నాలుగు వందలూ పెట్టి కంచిపట్టు చీర కొనిపెట్టండి. పాతికో పరకో పైనపడినా సందేహించకండేం - ఇదుగో మిమ్మల్నే."

నాకు పలకమారి ఘాటైన ఆవకాయతో కలసిన ఒక మెతుకు ముక్కులోకి వచ్చి వచ్చినంత పనైంది. రెండు గ్లాసుల మంచినీళ్ళు తాగి మూడుసార్లు నెత్తి బాదుకుని కాస్త తేరుకుని అన్నాను —

"మొన్ననేకదా నీకు నల్ల నైలెక్స్ చీర కొన్నాను. వచ్చే ఆవకాయ సీజన్‌లో తప్పక కంచిపట్టు చీర కొంటాను — సరేనా."

## 7

ఇది జరిగి సంవత్సరం కావస్తోంది. రెండు జాడీల ఆవకాయా తొమ్మిదినెలల్లో అరగించేశాం. ఈ రెండ్నెల్ల పైచిలుకూ ఆవకాయలేక ఆరాటపడిపోతున్నాం — ముఖ్యంగా నేను! ఈ ఏడు తాయారమ్మ దయ — మా ప్రాప్తి!

మర్నాడు ఆఫీసులో ఇష్టదైవాన్ని ప్రార్థిస్తూ కూర్చున్నా.

"సార్, పిలుస్తున్నారు సార్!"

ఎవరని అడక్కుండానే మేనేజర్ గదిలోకి దారితీశా. లోపల వాతావరణం అనుకూలంగా వుంది.

"నిలబడ్డారేం? కూర్చోండి." వెంకయ్యగారి ఆహ్వానం.

బ్రతుకుజీవుడా అని కుర్చీలో కూలబడ్డాను

"ఇది ఏ సీజన్"

'ఆవకాయ సీజన్' అనబోయి బలవంతాన ఆపుకుని అన్నా —

"సమ్మర్ సర్!"

"యు కెన్ టేక్ టుమారో ఆఫ్ అండర్‌స్టాండ్?"

"అవసరంలేదండి. నిరుడు..."

"ఏమిటవసరంలేదు? ఆవకాయ అవసరంలేని ఆంధ్రుడెవడండీ? ఆవకాయంటే నేను చెవి కోసుకుంటాను. తాయారు ముక్కూ, చెవులూ రెండూ కోసేసుకుంటుంది." ఆయన జోక్‌కి ఆయనే నవ్వుకుంటూ అన్నాడు.

"అదికాదు సార్..."

"ఏదికాదు?"

"అదే సర్, నిరుడు మా శ్రీమతి మీ ఆవిడ..."

"వ్వాట్?!"

"నిరుడు మా ఆవిడ మీ శ్రీమతిగార్కి హెల్ప్ చేసింది సార్ — ఆవకాయ విషయంలో అందువల్ల నేను శలవుపెట్టటం అనవసరం సార్."

"ఆఁ అవునవును రేపు మీ ఆవిడను మా శ్రీమతి వద్దకు పంపండి — అండ్ డోంట్ ఫర్గెట్ టు కన్వే మై థాంక్స్ టు హె."

మూడురోజులు తిరక్కుండా మాణిక్యం మంచి కంచిపట్టుచీర కొనుక్కుంది!


ప్రెస్టీజ్ వల్ల అమితలాభం పొందండి





**ప్రెస్టీజ్ వల్ల అమితలాభం పొందండి**

ప్రెస్టీజ్ ప్రెషర్ కుక్కర్ మీకు జీవితాంతం శ్రమ లేకుండా సేవ చేయడానికే తయారు చేయబడింది. మీరు ఇరవైఏళ్ళ క్రింద కొన్నప్పటికీ నేటికీ అది మీకు బాగా ఉపయోగపడాలనేదే మా ఆశయం. ఇరవైలక్షలమందికి పైగా ఉన్న మీలాంటి ప్రెస్టీజ్ కొనుగోలుదార్లకు సకాలంలో సమర్థవంతమైన సేవలను అందించాలనే ఒక కొత్తపథకం రూపొందించాము. ఈపథకంలో ఒక భాగంగా బెంగుళూరులోగల కంపెనీ ప్రధాన కార్యాలయంలో ప్రెస్టీజ్ నేషనల్ సర్వీసు సెంటర్ ఏర్పడింది.

**దేశవ్యాప్తంగా 350 సర్వీసు కేంద్రాలు**

ప్రెస్టీజ్ సర్వీసు పథకంలో ఇప్పటికే దేశవ్యాప్తంగా 350 అథరైజ్‌డ్ సర్వీసు కేంద్రాలు ఏర్పడ్డాయి. అందుచేత మీరు ఎక్కువదూరం వెళ్ళక్కరలేదు. అన్ని అథరైజ్‌డ్ సర్వీసు కేంద్రాలు అథరైజేషన్ సర్టిఫికెట్టును కలిగివున్నాయి. ప్రెస్టీజ్ సర్వీసు గుర్తుగల ఆసర్టిఫికెట్టుకోసం చూడండి. తక్కువధరలో మంచి స్పేరు పార్టులకు, కంపెనీలో శిక్షణపొందిన టెక్నిషియన్లచే నమ్మకమైన సర్వీసుకు మీకు హామీ ఇస్తున్నాం. ప్రెస్టీజ్ సర్వీసు రేటుకార్డు చూపించమని అడగండి.



**ఉచితం!**

"ప్రెస్టీజ్‌వల్ల అమిత లాభం పొందండి" అనే ఉపయోగకరమైన కరపత్రం. ఈ కూపనును నేడే పోస్టు చేయండి!

**మాకు వ్రాయండి-మీ సేవలకు మేమెల్లప్పుడూ సిద్ధమే**

350 అథరైజ్‌డ్ సర్వీసు కేంద్రాల విధులకు అనుబంధంగా 9 ప్రాంతీయ సర్వీసు కేంద్రాల సహాయంతో, ప్రెస్టీజ్ నేషనల్ సర్వీసు సెంటర్ ఒక సమన్వయ సమాచార శాఖగా పనిచేస్తుంది. మీ ప్రెస్టీజ్ నుండి అమితమైన లాభం ఎలాపొందాలో తెలుసుకోవాలన్నా, మీ ప్రాంతములోవున్న అథరైజ్‌డ్ సర్వీసు కేంద్రాల జాబితా కావాలన్నా ఈ క్రింది కూపనను పూర్తిచేసి పంపించండి. మీకు ఎలాంటి ఇబ్బందులున్నా, లేక మీరు ఎలాంటి సూచనలు చేయాలనుకున్నా, వ్యక్తిగతమైన సేవలను మీకు సంతోషపూర్వకంగా అందిస్తాం.

కన్స్యూమర్ సర్వీసు మేనేజర్,
ప్రెస్టీజ్ నేషనల్ సర్వీసు సెంటర్,
టి టి. (ప్రైవేటు) లిమిటెడ్,
దూరవాణినగర్, బెంగుళూరు-560 016.

పేరు ------------------------------
చిరునామా ------------------------------
------------------------------
బ్యాచ్‌నంబరు ------------------------------
(మూతలోపలిభాగం చూడండి)

కన్స్యూమర్
సర్వీసు మేనేజర్,
ప్రెస్టీజ్ నేషనల్ సర్వీసు
సెంటర్, టి టి. (ప్రైవేటు)
లిమిటెడ్, దూరవాణినగర్,
బెంగుళూరు-560 016.

Prestige NATIONAL SERVICE CENTRE

ASV

MCA-TT-54 Tel